## అన్ని సదుపాయాలతో నాణ్యమైన విద్య

బెల్లంపల్లి, సెప్టెంబర్ 24 : ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పిస్తూ విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. పట్టణంలోని రాంనగర్ ప్రాథమిక, మండంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆయన పరిశీలించారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో మహేందర్, ఏఈ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చేనెల 3న దసరా అడ్వాన్స్

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 24 : సింగరేణి కార్మికులకు దసరా పండుగ అడ్వాన్స్ అక్టోబర్ 3న చెల్లించాలని యాజమాన్యం మంళవారం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం సర్క్యులర్ జారీ చేసింది. దసరా అడ్వాన్స్ కింద పర్మినెంట్ ఉద్యోగులకు రూ.25,000, బదిలీ వర్కర్లకు రూ.12,500 చొప్పున చెల్లించాలని యాజమాన్యం నిర్ణయించింది. అలాగే అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సింగరేణి ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించింది.

## ఆక్రమణదారులకు నోటీసులు

భీమారం, సెప్టెంబర్ 24 : స్థానిక ఊర చెరువు ఆక్రమణదారులకు అధికారులు మంగళవారం రెండో రోజూ నోటీసులు జారీ చేశారు. ఊర చెరువు శిఖంతో పాటు, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో ఉన్న పలువురికి నోటీసులు ఇచ్చినట్లు ఆర్ఐ స్రవంతి తెలిపారు. సోమవారం అందుబాటులో లేని వారికి మంగళవారం నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. కాగా, ఈ అంశంపై పలువురు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తుంది.

## కూరగాయల వ్యాపారుల ఆందోళన

బెల్లంపల్లి, సెప్టెంబర్ 24 : ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన స్టాళ్లు పొందిన లబ్ధిదారులు మంగళవారం రాత్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మార్కెట్ భవన నిర్మాణాన్ని ప్రారంభించవద్దని డిమాండ్ చేశారు. 108 మంది లబ్ధిదారుల్లో కేవలం 65 మంది మాత్రమే మున్సిపాలిటీకి రూ.10 వేలు డిపాజిట్ చేశారని, మిగతా వారు చెల్లించలేదని తెలిపారు. డిపాజిట్ చెల్లించిన వారికే స్టాళ్ల లక్కీ డ్రా తీసి మిగతా వారికి తీయకపోతే నష్టపోతామని, ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసుకోవాలని కోరారు. కమిషనర్ స్పందించి, మాట్లాడారు. అన్ని ఏర్పాట్లు చేసుకున్నందున ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం ప్రారంభోత్సవం వాయిదా వేయడం కుదరదన్నారు. స్టాళ్ల లక్కీడ్రా మరోరోజు నిర్వహిస్తామని, ప్రారంభోత్సవం మాత్రం చేస్తామని చెప్పడంతో గొడవ సద్దుమనిగింది.

## తక్కువ ధరలో విద్యుత్ ఉపకరణాలు

నస్పూర్, సెప్టెంబర్ 24 : టీజీఎన్‌పీడీసీఎల్, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అనుబంధిత ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెట్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉపకరాలను తక్కువ ధరలో అందిస్తున్నట్లు మంచిర్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రావన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, ఇండక్షన్ స్టౌలు తదితర విద్యుత్ ఉపకరణాలు తక్కువ ధరలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వినియోగదారులు www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.

# న్యాయం చేస్తామనే నమ్మకం కలిగించాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్
- తాండూర్, మాదారం, కన్నెపల్లి, భీమిని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయం తనిఖీ



తాండూర్ : సర్కిల్ ఆఫీస్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

తాండూర్, సెప్టెంబర్ 24 : పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి నమ్మకం కలిగించేలా విధులు నిర్వర్తించాలని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. తాండూర్, మాదారం పోలీస్ స్టేషన్లతో పాటు, సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ల పరిసరాలతో పాటు, రిసెప్షన్ సెంటర్లను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది బాధ్యతాయుతంగా ఉంటూ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి, విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం పోలీస్ అధికారులలు, సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న పని తీరు, వారి సమస్యలను తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో భౌగోలిక పరిస్థితులు, మైన్స్, ట్రాఫిక్ సమస్యలు, లా అండ్ ఆర్డర్ సమస్యలు, మహిళలకు సంబంధించిన కేసులు, సమస్యలు, ముఖ్యమైన ప్రదేశాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారికి పోలీస్ శాఖ తరుపున అండగా ఉండాలన్నారు. స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి, ప్రజల సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ కే కుమారస్వామి, తాండూర్, మాదారం ఎస్ఐలు డీ కిరణ్‌కుమార్, సౌజన్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

**కన్నెపల్లి, భీమిని పోలీస్‌స్టేషన్ల తనిఖీ..**

కన్నెపల్లి, సెప్టెంబర్ 24 : కన్నెపల్లి, భీమిని పోలీస్‌స్టేషన్లను సీపీ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్ఐలు సౌజన్య, కిరణ్, విజయ్‌కుమార్, గంగారాం ఉన్నారు.

# 100 శాతం అక్షరాస్యత సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్24 : జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి, నవ భారత అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా 100 శాతం అక్షరాస్యత సాధనపై జిల్లా విద్య, ఇంటర్మీడియట్ విద్య, ఉన్నత విద్య, గ్రామీణ అభివృద్ధి, సంక్షేమ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖలు, మున్సిపల్ కమిషనర్, సెర్ప్, మెప్మా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నిరక్షరాస్యులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా డిగ్రీ విద్యార్థులను వలంటీర్లను నియమించుకోవాలని తెలిపారు. మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి, విద్యా బోధన చేసేలా గ్రామీణాభివృదిధ శాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, సహాయకులు తమ పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించి, వారి వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో సెర్ప్, మెప్మా సిబ్బంది కృషి చేయాలని, గ్రామస్థాయిలో వలంటీర్లను గుర్తించి వారి ద్వారా మ్యాచింగ్-బ్యాచింగ్ ప్రక్రియ పూర్తిచేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి ఉదయ్ బాబు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, డీపీవో భిక్షపతి, లైజనింగ్ అధికారి వంగర నాగరాజు, సైన్స్ అధికారి కటకం మధూకర్, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి

ఆసిఫాబాద్ టౌన్/నస్పూర్, సెప్టెంబర్ 24 : ఇంటింటా ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ అధికారి సీ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఇతర అదనపు ఎన్నికల అధికారులతో కలిసి ఇంటింటా ఓటరు నమోదు, బూత్ స్థాయి అధికారుల సర్వే, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అంశాలపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఓటరు నమోదు, జాబితా మార్పులు, చేర్పులు కోసం అందిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అధికారుల నియామకంపై ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ నుంచి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే హాజరయ్యారు. నెల చివరిలోగా జిల్లాలోని 2 ఆసిఫాబాద్, సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఓటరు జాబితా బూత్‌స్థాయి అధికారుల సమన్వయంతో ఇంటింటా సర్వే ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మంచిర్యాల నుంచి ఆర్డీవోలు రాములు , హరికృష్ణ, అధికారులు చంద్రకళ, ప్రసాద్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. నూతన పోలింగ్ కేంద్రాల గుర్తింపు అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టి, నివేదిక అందిస్తామని తెలిపారు.

# ఆర్‌ఎంపీ వైద్యం వికటించి యువకుడి మృతి

- దండేపల్లి మండలం కొత్తకొమ్ముగూడెంలో విషాదం

లక్షెట్టిపేట/దండేపల్లి, సెప్టెంబర్ 24 : దండేపల్లి మండలం కొర్విచెల్మ జీపీ పరిధిలోని కొత్తకొమ్ముగూడెంలో ఆర్‌ఎంపీ వైద్యం వికటించి, బత్తుల మధూకర్ (26) యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్, దండేపలిల ఎస్ఐ ఉదయ్‌కిరణ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధూకర్‌కు ఈ నెల 18న తీవ్రమైన జ్వరం వచ్చింది. కుటుంబ సభ్యులు దండేపల్లి మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ బొడ్డు శ్రీనివాసును పిలిచి సలహా తీసుకున్నారు. పెద్దాసుపత్రి అవసరం లేదని, తానే వైద్యం చేస్తానని చెప్పి, సెలైన్‌లో మూడు ఇంజక్షన్లు కలిపి, మధూకర్‌కు పెట్టాడు. అనంతరం నడుముకు కూడా ఓ ఇంజక్షన్ వేసి, వెళ్లిపోయాడు. కొద్ది సేపటికే మధూకర్‌కు విపరీతమైన చలి, తలనొప్పితో వణుకుతూ వాంతులు చేసుకున్నాడు. మళ్లీ ఆర్‌ఎంపీని పిలువగా, తాను ఇచ్చిన డోస్ ఎక్కువైనట్లున్నది చెప్పి, వెంటనే మంచిర్యాల దవాఖానకు తీసుకెళ్లాలని చెప్పాడు. మంచిర్యాలకు తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి, వైద్యం వికటించిందని, మెదడులో తీవ్ర సమస్య వచ్చిందని కరీంనగర్‌కు గానీ, హైదరాబాద్‌కు గానీ తీసుకెళ్లాలని సూచించారు. ముందుగా అదే రోజు కరీంనగర్‌లోని మెడికవర్ దవాఖానకు తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు. 21న మధూకర్ బ్రెయిన్ డెడ్ అయ్యిందని, బతకడం కష్టమని తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈ మేరకు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించి, వెంటిలేటర్ సాయం చికిత్స చేయించారు. కాగా, మంగళవారం ఉదయం మృతిచెందాడు. కాగా, మధూకర్ మృతికి వైద్యార్థతులు లేకుండా వైద్యం అందించిన ఆర్‌ఎంపీ బొడ్డు శ్రీనివాసే కారణమని తండి బత్తుల రాజలింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. మార్చురీలో ఉంచిన మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు.

**కుటుంబ సభ్యుల రాస్తారోకో..**

మధూకర్ మృతికి కారణమైన ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు లక్షెట్టిపేటలోని ఊత్కూర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. లక్షెట్టిపేట, దండేపల్లి ఎస్ఐలు సతీశ్, ఉదయ్‌కిరణ్ సిబ్బందితో వచ్చి, వారితో మాట్లాడారు. ఆర్‌ఎంపీ శ్రీనివాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పారు. సుమారు గంట పాటు జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774-All

BUSINESS OFFER

★ మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతినెలా ఆదాయం కావాలా? మీ దుకాణానికి ప్రచార ప్రకటనలు జోడించి ప్రతినెలా 7,000/- ఇస్తాము. Ph: 9948000371, 9948000373.
NT-338751-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
సిర్పూర్: 91827 77671, 91827 77677

## ఆదర్శ పాఠశాలలో సత్యశోధక్ దినోత్సవం

కాసిపేట, సెప్టెంబర్ 24 : కాసిపేట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో సమాజ మార్పు కోసం పూలే దంపతులు ఏర్పాటు చేసిన సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూలే సావిత్రిబాయి చిత్రపటాలకు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలు సమర్పించారు. వారి జీవిత చరిత్రలపై వ్యాసరచన, ఉప న్యాస పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి షేక్ షహీన్, ద్వితీయ, తృతీయ శివాని, రశ్మిత.., జూనియర్ విభాగంలో చంద్ర హస్య, అశ్విత, భావన బహుమతులు సాధించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లయ్య, సామాజిక చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి కే బాపు, గౌరవాధ్యక్షుడు చిన్న భీమన్న, పోశం, బెల్లంపల్లి మండలాధ్యక్షుడు కనకయ్య, రాజలింగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్థల సేకరణ అడ్డగింత

బెల్లంపల్లి, సెప్టెంబర్ 24 : మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే డంపింగ్ యార్డు స్థల సేకరణ కోసం వెళ్లిన అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. మండంలోని ఆకెనపల్లి శివారులో మంగళవారం స్థలం కొలిచేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిని రైతులు, పట్టాదారులు అడ్డుకున్నారు. స్థల సేకరణ నిలిపివేయాలని కోరారు. స్థలానికి సంబంధించి వారి వద్ద ఉన్న పాస్ బుక్కలను అధికారులకు చూపించారు. దీంతో అధికారులు, సిబ్బంది వెనుదిరిగి వెళ్లారు.

## యువకుడిపై దాడి.. కేసు నమోదు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 24 : జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డులో సోమవారం అర్ధరాత్రి యువకుడిపై జరిగిన దాడి జిల్లాలో కలకలం రేపింది. అర్ధరాత్రి జరిగిన గొడవతో పట్టణ పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో మంగళవారం బైపాస్ రోడ్డులో భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ విషయంపై పట్టణ సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా.. మంచిర్యాలకు చెందిన మేర సంజీవ్ బైపాస్‌రోడ్డులో పని చేస్తున్నాడని తెలుసుకున్న యువకులు రుద్ర తేజ, జ్ఞానేశ్వర్.. పాత కక్షలతో సోమవారం రాత్రి 12:30 గంటల ప్రాంతంలో కత్తులు, కర్రలతో దాడిచేశారని తెలిపారు. అక్కడే పనిచేస్తున్న వాచ్‌మన్‌కు గాయాలైనట్లు పేర్కొన్నారు. అనంతరం పరారయ్యారని తెలిపారు. మేర సంజీవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దాడిలో ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 24 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, ఎంపీడీవో రమేశ్ సూచించారు. మహిళా శక్తి పథకంలో భాగంగా స్త్రీ చైతన్య మండల సమాఖ్య పరిధిలోని 56 మందికి మంగళవారం పెరటి కోళ్లను అందించారు. డీపీఎం సారయ్య, ఏపీఎం భూమక్క, సీసీలు, సమాఖ్య సిబ్బంది, వీవోఏలు పాల్గొన్నారు.

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 24 : ఐకేపీ కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఐకేపీ ఏపీఎం దుర్గయ్యలు మండలంలోని వివిధ మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్ల పిల్లలను పంపిణీ చేశారు. 1500 కోళ్ల పిల్లలను అందజేశారు. ఎస్‌బీఐ మెనేజర్ నూతన్, సీసీలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించాలి

కౌటాల, సెప్టెంబర్ 24 : బకాయి ఉన్న విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆ శాఖ ఆసిఫాబాద్ సర్కిల్ ఏఈ ఈశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేటగిరి-2లో బకాయి ఉన్న వినియోగదారులతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట కాగజ్‌నగర్ ఏఈవో/ఈఆర్వో రాజమల్లు, ఏఈఈ రవీందర్, ఫోర్‌మన్ రమేశ్, జేఎల్ఎం లక్ష్మణ్ ఉన్నారు.

## ఇన్‌చార్జి డీఈవోగా యాదయ్య

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 24 : కుమ్రం భీం ఆసిఫాబాద్ ఇన్‌చార్జి డీఈవోగా మంచిర్యాల డీఈవో యాదయ్యకు బాధ్యతలు ఇస్తూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుత డీఈవో సెలవులపై వెళ్లడంతో ఆయన స్థానంలో బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొనారు.

## అభివృద్ధికి కృషి చేస్తా

తాండూర్, సెప్టెంబర్ 24 : బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. తహసీల్ కార్యాలయంలో మంగళవారం 35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మండలంలో రూ.6.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి/కాసిపేట, సెప్టెంబర్ 24 : బెల్లంపల్లి పట్టణంలోని వంద పడకల దవాఖానను ఎమ్మెల్యే వినోద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగాలు, డయాలసిస్ కేంద్రం, ఫార్మా విభాగాల పనితీరును పర్యవేక్షించారు. వైద్యులు సమయపాలన పాటించి నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన 9 మందికి కల్యాణ లక్ష్మి, 18 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కాసిపేట మండలానికి చెందిన 9 మందికి కల్యాణ లక్ష్మి, 18 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బెల్లంపల్లి, కాసిపేట మండలాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉపాధి అవకాశాలు

పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 24 : విద్యతోనే ఉపాధి అవకాశాలని మహిళా సాధికార కేంద్రం డీఎంసీ శారద పేర్కొన్నారు. పెంచికల్‌పేట్ కేజీబీవీలో మంగళవారం మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బృందం జీఏస్‌లు రాజేశ్వరి, రాణి, ఎస్ఎఫ్ఎల్ సాగర్, సీఏ మమత, సభ్యులు సత్య, రవళి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల సమాఖ్య సమావేశం

కన్నెపల్లి, సెప్టెంబర్ 24 : భీమిని మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు విమల అధ్యక్షతన సోమవారం భారత మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. వీవోల పనితీరు, గ్రామ సంఘాల అంతర్గత ఆడిట్ సెప్టెంబర్ బ్యాంకు లింకేజీ, డాటా ఎంట్రీ, సీహెచ్‌సీ పనిముట్లు, స్త్రీనిధి రికవరీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, మహిళా శక్తి కేంద్రాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం భీమిని ఎస్ఐ విజయ్‌కుమార్ మహిళ సంఘాల సభ్యులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఏపీఎం వసంత్, సీసీ శోభ, వీవోఏలు, పోలీసులు పాల్గొన్నారు.

## 'కుక్కలను హతమార్చడం దారుణం'

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 24 : చెన్నూర్ పట్టణంలో రోజురోజుకూ కుక్కల బెడద పెరుగుతున్నప్పటికీ వాటి నుంచి హాని కలుగకుండా చర్యలు తీసుకోకుండా హతమార్చడం దారుణమని జంతు ప్రేమికులు పేర్కొంటున్నారు. కుక్కలను హతమార్చిన వారిని, అందుకోసం ఆదేశాలిచ్చిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. బరిసెలతో చంపుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కాగా, కుక్కలను హతమార్చిన విధానంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ చైర్ పర్సన్ భర్త ఆదేశాల మేరకే మున్సిపల్ సిబ్బంది చంపినట్లు వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. కాగా, పోలీసుల బెదిరింపుల మేరకే చైర్‌పర్సన్ భర్త పేరు చెప్పారని, ఈ ఘటనతో ఆయనకు సంబంధంలేదని మున్సిపల్ సిబ్బంది తెలిపారు. పందులను కుక్కలు వేటాడుతుండడంతో ఈ పనికి పూనుకున్నట్లు చెప్పారు.

## భూ వివాదంతో స్తంభించిన అంత్యక్రియలు

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 24 : మందమర్రి పట్టణ శివారులో భూ వివాదంతో గంటన్నరపాటు ఓ వ్యక్తి అంత్యక్రియలు నిలిచిపోవడం పట్టణంలో చర్చానీయమైంది. బురదగూడెం గ్రామంలో నేతకాని కులానికి చెందిన శ్రీనివాస్(30) అనారోగ్యంతో మృతిచెందాడు. అంత్యక్రియలు జరిపేందుకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెళ్తున్న సమయంలో గౌడ సంఘానికి చెందిన పలువురు నేతలు వారిని అడ్డుకున్నారు. ఆ స్థలం గౌడ సంఘానిదని, అక్కడ అంత్యక్రియలను నిలువరించారు. దీంతో ఆగ్రహించిన గ్రామసుతలు వారితో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న మందమర్రి సీఐ కే శశిధర్ రెడ్డి, తహసీల్దార్ సతీశ్ అక్కడికి వెళ్లి, ఇరుపక్షాలతో మాట్లాడారు. రెండుమూడు రోజుల్లో స్థలానిన పరిశీలించి, వివాదాన్ని తొలగిస్తామని, అంత్యక్రియలు యథావిధిగా నిర్వహించాలని సూచించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం అంత్యక్రియలు పూర్తిచేశారు.

## ఉద్యోగుల జేఏసీ సమావేశంలో జిల్లా నాయకులు

హాజీపూర్, సెప్టెంబర్ 51 : ఐక్య ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశానికి మంచిర్యాల జిల్లా ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరితో పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో 205 సంఘాలతో సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోషియేట్ అధ్యక్షుడు బాపురావ్, రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య, నాయకులు రాంకుమార్, తిరుపతి, అంజయ్య, నరేందర్, సతీశ్‌కుమార్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు గోపాల్, లక్షెట్టిపేట యూనిట్ అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఎడ్లు పట్టివేత

రెబ్బెన, సెప్టెంబర్ 24 : అనుమతులు లెకుండా తరలిస్తున్న 8 ఎడ్లను పట్టుకున్నట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. గోలేటి సీహెచ్‌పీ వద్ద మంగళవారం ఉదయం 8:30 గంటల సమయంలో రెబ్బెన పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఆసిఫాబాద్ వైపు నుంచి బెల్లంపల్లి వైపు వెళుతున్న బొలెరో మ్యాక్స్ వాహనంలో ఎడ్లు తరలిస్తున్నటుల తెలిసిందన్నారు. డ్రైవర్ మెస్రం ప్రతీక్, క్లీనర్ ఎస్‌కే అసీఫ్‌ను విచారించగా, మహారాష్ట్రలోని గడ్‌చందూర్‌కు చెందిన సులేమాన్‌ఖాన్‌కు సంబంధించిన ఎడ్లను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ఎడ్లను కాగజ్‌నగర్‌లోని గోషాలకు తరలించి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

హాజీపూర్, సెప్టెంబర్ 24 : వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్ పాండే అన్నారు. ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల, జడ్పీ సెకండరీ, గుడిపేటలోని మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఎంజేపీలో వంటగది అపరిశుభ్రంగా ఉండడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భోజన విషయంలో రాజీపడేది లేదన్నారు.

## ఇసుక రీచ్‌ను అందుబాటులోకి తేవాలి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 24 : ఖర్జి ఇసుక రీచ్‌ను ప్రభుత్వం వెంటనే అందుబాటులోకి తేవాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టీ మణిరామ్‌సింగ్ కోరారు. మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక రీచ్ వద్ద చెక్‌డ్యాం నిర్మించడంతో నీరు చేరి ట్రాక్టర్లు బురదలో దిగబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక తరలింపునకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకోవాలి

శ్రీరాంపూర్/మందమర్రి రూరల్, సెప్టెంబర్ 24 : శ్రీరాంపూర్ కాలనీ, మందమర్రి ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాళ్లు సుజాత, దేవానంద్ మంగళవారం ఒక ప్రకటనలో వేర్వేరుగా తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు స్కాన్ చేసి https://iti.telangana gov.in వెబ్‌సైట్ దారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 4 విడుతల దరఖాస్తు చేసుకున్నా నమోదు చేసుకోవాల్సిన అవసరం లేద ని తెలిపారు. అప్లికేషన్ ప్రింటెడ్ కాపీతో అన్ని నిజ ధ్రువీకరణ పత్రాలతో శ్రీరాంపూర్ ఐటీఐలో 25 నుంచి 28వ తేదీ వరకు వాక్ ఇన్ అడ్మిషన్‌కు హాజరవ్వాలని కోరారు.

## కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవ

నస్పూర్, సెప్టెంబర్ 24 : వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం వలంటీర్స్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ భారత్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మంచిర్యాల గోదావరిలో చెత్తాచెదారం తొలగించారు. అనంతరం ఇటీవల డ్రగ్స్‌పై వలంటీర్స్‌తో కలిసి నిర్మించిన షార్ట్ ఫిల్మ్‌ను విడుదల చేశారు. వలంటీర్స్ జిల్లా కన్వీనర్ చంద్రమోహన్‌గౌడ్, కళాశాల ప్రోగ్రాం అధికారి షరీనాబేగం, అధ్యాపకులు తిరుమల, రాజేశ్, వంశీ, వలంటీర్లు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 24 : కాగజ్‌నగర్ పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ప్రజలకు స్వచ్ఛతపై ఎంపీడీవో రమేశ్ అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఆదేశాల మేరకు పలు కాలనీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సెక్రటరీ సునీల్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ ప్రనీల్, సిబ్బంది ఉన్నారు.

## జాతీయ సేవా పథకం దినోత్సవం

నస్పూర్, సెప్టెంబరు 24 : మంచిర్యాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో జాతీయ సేవా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ, కో ఆర్డినేటర్లు కుమారస్వామి, రాజయ్య, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వాంకిడి, సెప్టెంబర్ 24 : ఎన్ఎస్ఎస్ వలింటీర్లు సేవా దృకృథాన్ని అలవర్చుకోవాలని వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేందర్ కుమార్ అన్నారు. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. ఉపన్యాసకులు సంతోష్, రాజమౌళి, శ్రీధర్ కిరణ్ కుమార్ తిరుపతి, సంతోష్, సత్యం, అశ్విని, శ్రీకాంత్, వలంటీర్స్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి, సెప్టెంబర్ 24 : ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజయ్య మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాలలో సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు వివరించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎడ్ల సోమయ్య, లెక్చరర్లు పాల్గొన్నారు.

## నేడు ఎక్సైజ్ వాహనాలకు వేలం

బెల్లంపల్లి, సెప్టెంబర్ 24 : బెల్లంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు నేరాల కింద పట్టుబడిన వాహనాలకు బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జే ఇంద్రప్రసాద్ తెలిపారు. 25 బైకులు, రెండు ఆటోలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు వాహన విలువలో 50 శాతం ఈఎండీ ముందస్తుగా చెల్లించాలని తెలిపారు. వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## విష జ్వరంతో మహిళ మృతి

భీమారం, సెప్టెంబర్ 24 : భీమారం మండల కేంద్రానికి చెందిన జలంపల్లి అంకు (46) సోమవారం రాత్రి విషజ్వరంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న అంకును స్థానిక దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్‌లోని దవాఖానకు సోమవారం రాత్రి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అంకుకు ఇద్దరు కొడుకులు ఉన్నారు.

## లక్షెట్టిపేట ఫొటోగ్రాఫర్‌కు అంతర్జాతీయ అవార్డు

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 24 : లక్షెట్టిపేట పట్టణానికి చెందిన ఇందూరి సాయికృష్ణ ఫొటోగ్రఫీలో అంతర్జాతీయ ఫిలోషిప్ అవార్డుకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం సిగ్మా ఫొటోగ్రఫీ ఆఫర్స్‌లో భాగంగా జరిగిన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ వేడుకల్లో ఆయన ప్రతిభ చూపాడు. సాలార్జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్ అండ్ కల్చర్ డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ దావనపెల్లి సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. సాయికృష్ణను పట్టణ ఫొటోగ్రాఫర్లు, మిత్రులు అభినందించారు.

## ఒకరి బైండోవర్

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలోని నాగమ్మ చెరువు శిఖం భూమిలో టేలా వేసి కబ్జాకు ప్రయత్నించిన షేక్ అమ్రాన్‌ను తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు సిర్పూర్(టీ) ఎస్ఐ కమలాకర్ మంగళవారం తెలిపారు. బస్టాండ్ సమీపంలోని నాగమ్మ చెరువు శిఖం భూమిలో సోమవారం రాత్రి టేలా వేసినందుకు రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

దహెగాం, సెప్టెంబర్ 24 : హత్తిని గ్రామానికి చెందిన చిట్టం కోటయ్య(58) 20వ తేదీన పురుగు లమందు తాగగా, సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ కందూరి రాజు తెలిపారు. కోటయ్య కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం తీసుకున్నప్పటికీ తగ్గలేదు. 20వ తేదీన భార్య సరిత మేకలు కాసేందుకు వెళ్లిన సమయంలో పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చేసరికి వాసన రావడంతో ప్రశ్నించగా, విషయం చెప్పాడు. వెంటనే బెల్లంపల్లి తరలించి చికిత్స అందిచి, అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. కాగా, పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాపుత చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఎంజేపీ విద్యార్థికి వెండి పతకం

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 24 : జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన క్రీడాకారుడు విష్ణు వెండి పతకం సాధించాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 19, 20వ తేదీల్లో జరిగిన 10వ తెలంగాణ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపాడు. విష్ణును ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్‌తో పాటు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## ఆక్రమణలపై చర్యలు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 24 : పట్టణంలో మురుగుకాలువలపై ఏర్పాటు చేసుకున్న అక్రమ నిర్మాణాలను తొలగించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బజార్ ఏరియాలో మంగళవారం రోడ్డుకు ఇరువైపులా మురుగుకాలువలపై ఉన్న ఆక్రమణలను సిబ్బంది కొలతలు తీసుకున్నారు. కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించలేకపోతున్నామని పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్ కూడా ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు.